జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని
భరోసా కేంద్రం వైద్యులను సన్మానిస్తున్న హైదరాబాద్ కమిషనర్ సిపి సజ్జనార్

హైదరాబాద్ వార్త

- జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి
- పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లపై తీవ్ర ఆరోపణలు
- టెండర్లు బినామీలకు అప్పజెప్పేందుకు నిబంధనల్లో మార్పు
- ప్రతిపనీ వారికే దక్కేలా అనుకూల నిర్ణయాలు
- వరుసగా కొన్ని సంస్థలకే దక్కడం పట్ల సర్వత్రా విమర్శలు
- విజిలెన్స్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్



జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బాధిత కాంట్రాక్టర్లు

హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త: ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న మూసీ నదిని శుభ్రం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం భారీ స్థాయిలో డీసిల్టింగ్ పనులు చేపడుతోంది. వర్షాకాలంలో వరద ముప్పు తగ్గించేందుకు కోట్ల రూపాయలతో పనులు నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ అదే పనులకు సంబంధించిన టెండర్లలో మాత్రం పారదర్శకత కనిపించడం లేదని కాంట్రా క్టర్లు ఆరోపిస్తున్నారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులే తమకు నచ్చిన సంస్థలకు అనుకూలంగా టెండర్ నిబంధనలు రూపొందిస్తున్నారని విమర్శిస్తున్నారు. నిబంధనలను కావాలనే కఠినతరం చేసి, కొందరు మాత్రమే అర్హత సాధించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కార్వాన్ సర్కిల్‌లో తాజాగా విడుదల చేసిన టెండర్ చుట్టూ వివాదం రాజుకుంది. 26 శాతం లెస్ కోట్ చేసిన వారిని పక్కనబెట్టి 2 శాతం కోట్ చేసిన సంస్థకు ఎలా టెండర్ దక్కిందనే విషయం చర్చనీయాంశంగా మారింది. గోల్కొండ జోన్ లోని కార్వాన్ సర్కిల్ పరిధిలో పురానాపూల్ బ్రిడ్జి నుంచి అత్తాపూ ర్ బ్రిడ్జి వరకు మూసీ డీసిల్టింగ్ పనులకు ఇటీవల టెండర్ విడుదలైంది. అయితే ఈ టెండర్‌లో ఇతర సర్కిళ్లలో ఎక్కడా లేని విధంగా ఈఎస్ఐ, ఈపీఎఫ్ తప్పనిసరి అనే నిబంధన చేర్చడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇది పూర్తిగా యంత్రాలతో, ముఖ్యంగా హిటాచీ వంటి యంత్రాలతో చేసే పని అయినప్పుడు ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిబంధనలు ఎందుకు పెట్టారని ఇతర కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. మ్యాన్‌పవర్ ఆధారిత పనులకు మాత్రమే వర్తించే షరతులను యంత్రాలతో చేసే పనులకు వర్తింపజేయడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీస్తున్నారు. ఈ నిబంధనల వల్ల ముందే నిర్ణయించుకున్న సంస్థకు టెండర్ వచ్చేలా చేశారని ఆరోపిస్తున్నారు.

ట్రాన్స్‌ఫర్ అయినా తిరిగి అక్కడికే..

కార్వాన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌పై కాంట్రాక్టర్లు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఒకే పోస్టులో ఏళ్ల తరబడి కొనసాగుతూ, తనకు అనుకూలంగా వ్యవస్థను మార్చుకుంటున్నారని చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్లలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగానికి బదిలీ అయినప్పటికీ, తిరిగి అదే కార్వాన్ సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నారని ఆరోపిస్తున్నారు. టెండర్ నిబంధనల నుంచి బిల్లుల క్లియరెన్స్ వరకు ప్రతీ విషయంలో తన ఇష్టారాజ్యంగా వ్యవహ రిస్తున్నాడని, బిల్లు విడుదల చేయాలంటే కమిషన్ ఇవ్వాల్సిందేనంటూ కాంట్రాక్టర్ల మధ్య చర్చ జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి...

ఇటీవల విడుదల చేసిన మూసీ క్లీనింగ్ టెండర్‌లో కూడా ఇదే తరహా వ్యవహారం జరిగిందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. తాము ప్రభుత్వానికి లాభం చేకూరేలా 26 శాతం లెస్‌కు కోట్ చేసినప్పటికీ, తమ బిడ్‌ను పక్కనపెట్టి కేవలం రెండు శాతం లెస్ కోట్ చేసిన సంస్థకు టెండర్ కట్టబెట్టారని ఆరోపి స్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు ఎక్కువ ప్రయోజనం చేకూరే బిడ్ ను పక్కన పెట్టి, తక్కువ తగ్గింపు ఇచ్చిన సంస్థకు పనులు అప్పగిం చడం వెనుక అసలు కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ముందుగానే నిర్ణయించుకున్న సంస్థకు పనులు ఇవ్వాలనే ఉద్దేశంతోనే మొత్తం ప్రక్రియ నడిపించారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్..విజిలెన్స్‌అధికారులకు ఫిర్యాదు..

ఈవ్యవహారంపై ఇప్పటికే పలువురు కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కాంట్రాక్టర్లు తెలిపారు. కార్వాన్ సర్కిల్‌లో జరిగిన టెండర్ ప్రక్రియతో పాటు, టెండర్ నిబంధనల రూపకల్పన, అర్హతల నిర్ణయం, టెక్నికల్ ఎవాల్యుయేషన్, వర్క్ ఆర్డర్ జారీ వరకు ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాం డ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో జరిగే పనుల్లో పారదర్శకత లేకపోతే ప్రజాధనం వృథా అవుతుందని, ఈ ఒక్క టెండర్ మాత్రమే కాకుండా గత నాలుగేళ్లుగా జరిగిన టెండర్లను బయటకి తీసి, విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరుతున్నారు. దీంతో కమిషనర్, విజిలెన్స్ అధికారులు ఈ ఫిర్యాదులపై ఎలా స్పందిస్తారు..? ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

దోమల నివారణకు పకడ్బందీ చర్యలు

- జీవీపీలా నుంచి ప్రతిరోజు చెత్తను తరలించాలి
- అనువైన ప్రదేశాల్లో మొక్కలు నాటాలి
- ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

ఎంఎంసీ పరిధిలోని మన్సూరాబాద్, హయత్ నగర్ ఖాల్సా ప్రాంతాలలో పర్యటిస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

హైదరాబాద్, జూలై 1 ప్రభాతవార్త: అనువైన చోట్ల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మన్సూరాబాద్ సహారా ఎస్టేట్స్, కుంట్లూర్, హయత్ నగర్ ఖాల్సా, నాగోల్ బండ్లగూడ రోడ్డులో అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్ సహారా ఎస్టేట్స్‌లో వెక్టర్ కంట్రోల్ డ్రైవ్‌లో భాగంగా దోమల లార్వా వ్యాప్తి చెందే ప్రాంతాలను పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్ పరిసరాల్లో నిల్వ ఉన్న నీరు దోమల ఉత్పత్తికి అనుకూలంగా మారే అవకాశం ఉందని గుర్తించిన కమిషనర్, సంబంధిత అధికారులు, సొసైటీ ప్రతినిధులకు వెంటనే నిల్వ నీటిని తొలగించి, స్విమ్మింగ్ పూల్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే దోమల నివారణకు అవసరమైన యాంటీ లార్వా చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిశుభ్రత పాటిస్తూ వెక్టర్ కంట్రోల్ కార్యక్రమాలకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. హయత్‌నగర్ ఖాల్సాలోని ఆర్టీసీ కాలనీ ప్రధాన రహదారిపై జీవీపీను తనిఖీ చేసి చెత్త తరలింపు ప్రక్రియపై రామ్‌కీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎటువంటి ఆలస్యం లేకుండా చెత్తను తరలించాలని ఆదేశించారు. జీవీపీలు పూర్తిగా తొలగేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సకాలంలో చెత్తను తొలగిస్తూ పారిశుద్ధ్య చర్యలను మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచించారు. కుంట్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీసీ, డీఈ, ఏఈ, యూబీడీ అధికారులు, రామ్‌కీ ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించిన కమిషనర్, వెంటనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి ఆరోగ్యక రమైన ఎదుగుదల, దీర్ఘకాల మనుగడకు అవసరమైన నిర్వహణ చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. వీటితో పాటు నాగోల్‌లోని బండ్లగూడ రోడ్డులో ఉన్న ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయంను పరిశీలించారు. రహదారి పక్కన, గృహ సముదాయంలోని ఖాళీ ప్రదేశాల్లో వెంటనే మొక్కలు నాటాలని యూబీడీ అధికారులను ఆదేశించారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా సంరక్షణ చర్యలు చేపట్టి, అవి ఆరోగ్యంగా పెరిగి దీర్ఘకాలం మనుగడ సాగించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ సూచించారు.

ఉప్పల్ మాస్టర్‌చెఫ్ రెస్టారెంట్‌లో ఎంఎంసి అధికారుల తనిఖీలు

అపరిశుభ్రంగా పరిసరాలు.. రూ.25వేల జరిమానా విధింపు

మాస్టర్ చెఫ్ హోటల్‌లో నాసిరకం మాసం పట్టుకున్న అధికారులు

ఉప్పల్, జూలై 1 ప్రభాతవార్త : ఉప్పల్ మాస్టర్‌చెఫ్ రెస్టారెంట్‌లో బుధవారం ఎంఎంసి ఆహార భద్రత శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు .తనిఖీల సందర్భంగా హోటల్‌లో ఆహార భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించినందుకు రూ.25వేల జరిమానా విధించి, సంబంధిత యాజమాన్యానికి అధికారిక నోటీసు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటల్ స్టోర్ రూమ్ మరియు డైనింగ్ ఏరియాలో ఈగలు, బొద్దింకలు ఉన్నాయని, మాంసాహార ఆహార పదార్థాలను తగిన ఉష్ణోగ్రతలు, పరిశుభ్రత ప్రమాణాలు లేకుండా నిల్వ చేశారని తెలిపారు. ఆహార పదార్థాలను మూతలు లేకుండా ఉంచడం వల్ల క్రాస్ కంటామినేషన్‌కు అవకాశం ఉందని తెలిపారు. రిఫ్రిజిరేటర్ల ఉష్ణోగ్రత రికార్డులు నిర్వహించడం లేదని, ఆహారాన్ని తయారు చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం లేదని పేర్కొన్నారు. చెత్త బుట్టలను మూతలు లేకుండా ఉపయోగిస్తున్నారని, స్టోర్ రూమ్ అత్యంత అపరిశుభ్రంగా ఉండటంతో పాటు, ఆహార పదార్థాల నిల్వకు ప్యాలెట్లు ఉపయోగించకపోవడం లేదన్నారు. పెస్ట్ కంట్రోల్‌కు సంబంధించిన రికార్డులు నిర్వహించడం లేదని, కొన్ని ఆహార పదార్థాలపై తప్పనిసరిగా ఉండాల్సిన లేబుళ్లు లేకపోవడంతో తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆహార భద్రతా నిబంధనలు పాటించని ఆహార వ్యాపార సంస్థలపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అదే విధంగా నగరంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు మరియు ఇతర ఆహార వ్యాపార సంస్థలు నిబంధనలను తప్పనిసరిగా పాటించి, పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలని సూచించారు.

చెరువులో మహిళ అస్తి పంజరం

అల్వాల్, జూలై 1 ప్రభాతవార్త: మహిళ అస్తి పంజరం చెరువులో తేలడం కలకలం రేపుతోంది. మచ్చబొల్లారంలోని మోత్కుల కుంట చెరువులో అస్తి పంజరాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అస్తి పంజరం మహిళదిగా పోలీసులు తేల్చారు. శవానికి సంబంధించి మాంసం ఎక్కడా లేక పోగా కేవలం ఎముకలు మాత్రమే మిగిలి ఉన్నాయి. మహిళ చనిపోయి కనీసం నెల రోజులై ఉంటుందనేది అంచనా. చెరువులో మునికి చనిపోయే అంత నీరు ఇక్కడ ఉండదు. హత్య చేసి శవాన్ని చెరువులో పడేసి ఉంటారని తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఛత్రినాక- కందికల్ ప్రధాన రోడ్డుకు మోక్షం

- రూ.30లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం - పాతకాలం కచ్చామోరీతో కష్టం

ఛత్రినాక అవుట్ పోస్టు వద్ద జెసిబితో రోడ్డును తొవ్వుతున్న దృశ్యం

చాంద్రాయణగుట్ట, జూలై 1, ప్రభాతవార్త : దశాబ్దాల కాలం తరువాత ఛత్రినాక – కందికల్ ప్రధాన రోడ్డుకు మోక్షం లభించింది. ఎళ్ళ నాడు నిర్మించిన రోడ్డు గతకుల మయంగా మారి నడవలేని పరిస్థితి ఏర్పడి నిత్యం నరకం అనుభవిస్తున్నారు. దీనికి తోడు వర్షాకాలంలో వచ్చే వరదలతో రోడ్డు మరింత దయనీయంగా మారుతుంది. ఆ సమయంలో ప్రధాన రోడ్డుపై వెళ్ళే సహసం చేయలేని పరిస్థితి. ఇక ఈ మార్గంలో రోడ్డు విస్తరణ మూలన పడింది. అదే ఇరుకు రోడ్డు. రెండు భారీ వాహనాలు ఎదురైతే ముందుకు వెళ్ళలేని పరిస్థితి. దీనికి తోడ్డు ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌తో సమస్య జఠిలమైయ్యింది. గత కొన్నేళ్లుగా స్థానిక ప్రజలు భరిస్తూ వస్తున్నారు. ఎంత మంది అధికారులు వచ్చినా నామ్కేవాస్తే పనులతో కాలం వెళ్ళదీశారు. చివరకు జీహెచ్ఎంసి అప్పటి చార్మినార్, ప్రస్తుత రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి సమస్యను క్షేత్ర స్థాయిలోకి వెళ్ళి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎలాగైనా ప్రజల వరద నీటి కష్టాలను, ప్రధాన రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు స్వతంత్ర సంస్థచే సర్వే చేయించారు. ప్రస్తుతం ఛత్రినాక అవుట్ పోస్టు నుండి బోయిగూడ మూత్రశాల వరకు సుమారు రూ.30లక్షలతో 230 మీటర్ల పొడవున ఆధునిక రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభమైయ్యాయి. పనులు దాదాపు 15 రోజుల్లో పూర్తి కానున్నాయి. సూపరింటెండింగ్ ఇంజనీరు నరేందర్ గౌడ్, డిఇ భీమా నాయుడు, జంగమ్మెట్ సర్కిల్ ఎఇ ఆర్తిగౌడులు పర్యవేక్షిస్తున్నారు. పనులు ఎలాంటి ఆటంకం లేకుండా సాగేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు ఆ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. లాల్‌దర్వాజా మోడ్, ఛత్రినాక ఆవుట్ పోస్టు, ఉప్పుగూడ మంగళముఖి హనుమాన్, నల్లవాగు కందికల్ బ్రిడ్జ్ ప్రాంతాలలో వాహనాలను దారి మళ్ళించారు. బుధవారం తొలి రోజు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సరియైన దారి తెలియక గల్లీలన్ని తిరిగారు. మరోవైపు ఆర్టీసి బస్సులు నడవక ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ పనులకు వెళ్ళేవారు ఆటోలను ఆశ్రయించారు. రోడ్డు తిరిగి ప్రారంభమైయ్యే వరకు ఇబ్బందులు తప్పవు. అదేవిధంగా జలమండలి ప్రాజెక్ట్ విభాగం ఆధ్వర్యంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నారు. ఛత్రినాక సెక్షన్ కార్యాలయం ఎదురుగా పెద్ద గోయి తీసి భారీ పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఛత్రినాక టి–జంక్షన్ నుండి అచ్చయ్యనగర్ కల్వర్ట్ వరకు అధిక సామర్థ్యం గల డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మించారు. మొత్తం మీద ఒకవైపు జీహెచ్ఎంసి, మరోవైపు జలమండలి అభివృద్ధి పనులతో ఛత్రినాక ప్రాంతానికి కొంత వరకు సమస్యలు తీరనున్నాయి. అయితే చిత్రగుప్త దేవాలయం, బోయిగూడ, భట్జీనగర్ వైపు నుండి వచ్చే కచ్చామోరీ (ఎస్‌డబ్ల్యూడ్రైన్) ఏళ్ళనాటిది. సామర్థ్యం తక్కువగా ఉండి వరద నీరు సాఫీగా వెళ్ళలేకపోతుంది. పాతకాలం నాటి కచ్చామోరీ సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంది. తద్వారా సమీప బస్తీలకు, ప్రధాన రోడ్డుపై గల దుకాణాలకు వరద ముంపు తప్పనుంది.

నత్తనడకన 'సర్' ప్రక్రియ

- ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీలో జాప్యం
- గ్రేటర్‌లో ఇప్పటివరకు 30-40 శాతమే అందజేత
- అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీల్లోనే అధిక సమయం
- ఇళ్లకు తాళాలు, ఉద్యోగాలకు వెళ్లే వారు ఎక్కువగా ఉండటం వల్లే అంటున్న బిఎల్‌వోలు

ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ (ఫైల్)

హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త: ఓటరు జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ గ్రేటర్‌లో నత్తనడకన కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ వేగంగా సాగుతుండగా... హైదరాబాద్ లో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. ఇప్పటివరకు నగరంలో కేవలం 35శాతం ఫారాలే పంపిణీ అయ్యాయి. రాష్ట్ర సగటు దాదాపు 60 శాతం ఉండగా... నల్గొండ జిల్లాలో 97 శాతం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 96 శాతం ఫారాల పంపిణీ పూర్తయింది. అయితే రాజధాని హైదరాబాద్ మాత్రం రాష్ట్రంలోనే వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా నిలిచింది. గురువారం సాయంత్రం లోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రత్యేక అదనపు సిబ్బందిని వినియోగిస్తూ ఫారాల పంపిణీ వేగవంతం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు బీఎల్ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. నగరంలోని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఉద్యోగాలకు వెళ్లే ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఫారాల పంపిణీకి మరింత సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు. అలాగే సర్ ప్రక్రియ నెమ్మదిగా సాగడానికి మరో ప్రధాన కారణం కొత్తగా నియమించిన బీఎల్ఓ లేనని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్నికల సర్వేలు, ఓటరు జాబితాల సవరణ కార్యక్రమాల్లో పాల్గొనని సిబ్బందిని కూడా ఈసారి బీఎల్ఓ లుగా నియమించడంతో... వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడానికి సమయం పట్టిందని ఈఆర్‌వోలు చెబుతున్నారు. ఫారాల పంపిణీ విధానం, ఓటర్ల వివరాల నమోదు, యాప్ వినియోగం వంటి అంశాలపై శిక్షణ పూర్తయిన తర్వాతే ఫీల్డ్ లోకి పంపినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే ఓల్డ్ సిటీ లో ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ మరింత స్లో గా సాగుతోంది.. పాతబస్తీలోని పలు డివిజన్లలో ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఆశించిన స్థాయికి చేరుకోలేదు. ఇరుకైన వీధులు, అధిక జనసాంద్రత, పాత భవనాలు, అద్దెకు నివసించే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం, ఓటర్లు ఇంట్లో అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో బీఎల్ఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎక్కువగా ఉద్యోగస్తులు..ఇళ్లకు తాళాలు

మరోవైపు నగరంలో చాలా మంది ఓటర్లు ఉదయం ఉద్యోగాలకు వెళ్లి రాత్రి మాత్రమే ఇళ్లకు వస్తుండటంతో ఒకే ఇంటికి రెండుమూడు సార్లు వెళ్లాల్సి వస్తోందని బీఎల్ఓలు చెబుతున్నారు. కొందరు నగరానికి బయట ఉండటం... మరికొందరు తాళాలు వేసి వెళ్లిపోవడం వల్ల కూడా ఫారాల పంపిణీ ఆలస్యం అవుతోందంటున్నారు. ఓటర్ అందుబాటులో లేకుంటే ఇంట్లో పేరెంట్స్ కు ఎన్యూమరేషన్ ఫామ్స్ ఇస్తున్నామని చెబుతున్నారు. అలాగే శుక్రవారం నుంచి ఫిల్ చేసిన ఫారాలను ఓటర్ల నుంచి కలెక్ట్ చేసుకుంటామని చెబుతున్నారు. ఒకే ఇంటికి పలుమార్లు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఫారాల పంపిణీ ప్రక్రియ మరింత ఆలస్యం అవుతోందని చెబుతున్నారు.

కుళ్లిన చేపలు, రొయ్యల అక్రమ నిల్వ

-నలుగురు నిందితుల అరెస్ట్

90 వేల విలువైన చేపల నిల్వలు , సోడియం బైకార్బోనేట్ పౌడర్ స్వాధీనం

హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తూ, కుళ్లిన చేపలు, రొయ్యలను రసాయనాలతో నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఒక ముఠాను టాస్క్‌ఫోర్స్ గోల్కొండ బృందం, మంగళహాట్ పోలీసులతో కలిసి గుట్టు రట్టు చేసింది. మంగళహాట్ పరిధిలోని మాచిపురా బైరక్ వద్ద గల "తార ఫిషరీస్" దుకాణంపై నిర్వహించిన ఈ ఆకస్మిక దాడుల్లో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టయిన నిందితులను శంకర్ సింగ్ , మాన్ సింగ్ , గులాబ్ సింగ్ , రోహిత్ సింగ్ గా గుర్తించారు. నిందితుల నుంచి సుమారు రూ. 90,000 విలువైన 100 కిలోల పాడైపోయిన రొయ్యలు, 162 కిలోల వివిధ రకాల చేపలు (సాల్మన్, మారుల్), 6 బస్తాల ఉప్పు మరియు 10 కిలోల సోడియం బైకార్బోనేట్ పౌడర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రధాన నిందితుడు శంకర్ సింగ్ బేగంబజార్ మార్కెట్ నుండి తక్కువ ధరకే చేపలు, రొయ్యలను కొనుగోలు చేసేవాడు. జనావాసాల మధ్య ఉన్న తన దుకాణంలో ఏమాత్రం పరిశుభ్రత లేకుండా, కుళ్లిపోకుండా ఉండేందుకు ,దుర్వాసన రాకుండా నిరోధించడానికి సోడియం పౌడర్‌ను ఉపయోగించేవాడు. వీటిని ప్లాస్టిక్ టబ్బులు, డీప్ ఫ్రీజర్లలో నిల్వ ఉంచి, తాజా చేపలుగా భ్రమింపజేస్తూ శుభకార్యాలకు, ఈవెంట్లకు మరియు హోటళ్లకు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టి లాభాలు గడిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఇలాంటి నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అధికారులు హెచ్చరించారు. పక్కా సమాచారంతో పోలీసులు ఈ సంయుక్త దాడి నిర్వహించి నిందితులను పట్టుకున్నారు. ఈ ఆపరేషన్ హైదరాబాద్ సిటీ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు , గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వెంకటేష్, మంగళహాట్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాఘవేంద్ర, సబ్ ఇన్‌స్పెక్టర్లు కె. వెంకటరమణ, ఎన్. నవీన్, ఆంజనేయులు మరియు సిబ్బంది ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది

వీధి దీపాల సమస్యలు పరిష్కరించండి

వీధిదీపాల సమస్యను పరిశీలిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

జూబ్లీహిల్స్, జులై 1, ప్రభాతవార్తః ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో 'సమస్యలపై సమరం' కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా చాలా రోజులుగా ఎదుర్కొంటున్న వీధిదీపాల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గత కొన్ని నెలలుగా వీధిదీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అంతేకాకుండా మహిళలు, యువతులు రాత్రివేళల్లో బయటకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికితోడు డ్రైనేజీ పొంగి పొర్లుతుందని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. బోరింగ్ పనిచేయడం లేదని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఓను సస్పెండ్ చేయాలి

ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యమకారులు

అల్వాల్, జూలై 1 ప్రభాతవార్త: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలను ప్రశ్నిస్తే ఉద్యమకారులను అవహేళన చేసిన డిఎంహెచ్ఓను తక్షణం ప్రభుత్వం సస్పెండ్ చేయాలని అల్వాల్ జెఎసి నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఆరోగ్య కేంద్రం ముందు ఆందళనకు దిగారు. ఆరోగ్య కేంద్రంలోని సమస్యలు, వైద్యులు ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే ఫిర్యాదుతో డిఎంహెచ్ఓ ఉమాగౌరి మంగళవారం అకస్మిక తనిఖీలు చేయడం జరిగింది. తనిఖీలు సందర్భంగా జెఎసి నాయుడు సురేందర్ రెడ్డి ఇక్కడి సమస్యలు ప్రధానంగా సిబ్బంది కోరత, వైద్యులు ఆలస్యంగా వస్తుండడాన్ని డిఎంహెచ్ఓ దృష్టికి తెచ్చారు. ఆసుపత్రి సంగతి మేము చూసుకుంటాం, ఏం చేయాలో చేస్తాం అంటూనే ఎమ్మెల్సీ కోదండరామ్, కెసిఆర్ తమకు తెలియదని కలెక్టర్ మాత్రమే తెలుసు అని డిఎంహెచ్ఓ దురుసుగా మాట్లాడడం జరిగిందని సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. కోదండరామ్‌ను, ఉద్యమకారులను అవమానించినందుకు గాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు అల్వాల్ జెఎసి నేతలు ఆందోళన చేయడంతో పాటుగా డిఎంహెచ్ఎను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్ఎంఆర్ఎల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి బాధ్యతలు

హైదరాబాద్, జులై 1, ప్రభాతవార్త : హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా బి. అజిత్ రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రసూల్ పురాలోని మెట్రో రైల్ భవన్ లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. హెచ్ ఎంఆర్ఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆయనను మర్యా దపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా అదనపు ఎం.డీ అజిత్ రెడ్డి హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారుల తో ఫేజ్ 1, ఫేజ్2 తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొత్త అదన పు ఎండీ అజిత్ రెడ్డిని కలిసిన వారిలో హెచ్ఎంఆర్ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజ ర్ బి.ఆనంద మోహన్, జనరల్ మేనేజర్లు ఎం.విష్ణువర్ధన్ రెడ్డి, డి. సూర్యప్రకాశం, శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ వై.సాయపరెడ్డిలు ఉన్నారు.

అంకితభావంతో ప్రజారోగ్య సేవలు అందించటం అభినందనీయం

హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్

డాక్టర్ మనోజ్‌రెడ్డిని సత్కరిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్

ముషీరాబాద్, జులై 1, ప్రభాతవార్త: సమాజంలో వైద్యులు అంకిత భావంతో ప్రజారోగ్య సేవలు అందించటం అభినందనీయమని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ కొనియాడారు. బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రజలకు విశిష్ట వైద్య సేవలు అందిస్తున్న ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డిని ఆయన కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరితో కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి నిబద్ధత, నిజాయితీ, ప్రజారోగ్య సేవల పట్ల ఆయన చూపుతున్న అంకితభావాన్ని ప్రశంసించారు. సమాజ సేవలో డాక్టర్ మనోజ్‌రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అల్వాల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో వైద్య శిభిరం

అల్వాల్, జూలై 1 ప్రభాతవార్త: అల్వాల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో బుధవారం వైద్య శిభిరం జరిగింది. తిరిమలగిరి ట్రాఫిక్ ఎసిపి శంకర్ రాజు పర్యవేక్షణలో సాగిన వైద్య శిభిరం నందు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు విధులు కష్టతరమైనవి అన్న ఎసిపి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. శారీరకంగా, మానసికంగా, ఆరోగ్య పరంగా దృడంగా ఉండాలని సూచించారు. జాతీయ వైద్యులు దినోత్సవాన్ని పురస్కరించుకుని శిభిరంలో సేవలు అందించిన శ్రీకర ఆసుపత్రి వైద్యులు భవాని, అంజి, నందిని, సౌజన్య, శ్రావణ్ కుమార్, పద్మ సాయి డెంటల్ క్లీనిక్ సాకేత్, రెటినో వా ఫౌండేషన్‌కు చెందిన భరత్ కుమార్ ఇతర సిబ్బందిని ఎసిపి సన్మానించారు.

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని యూపీహెచ్‌సి సెంటర్‌ని సందర్శించి డాక్టర్ మౌనికతో పాటు ఇతర వైద్య సిబ్బందిని సన్మానించిన ఎర్రబెల్లి సతీష్

సాహితీ భీష్ముడు కొలకలూరి ఇనాక్ : సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి జులై 1 (ప్రభాతవార్త) : తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియలలో రచనలు చేసిన కొలకలూరి ఇనాక్ సాహితీ భీష్ముడు అని శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి కొని యాడారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ప్రఖ్యాత సాహితీ వేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం కార్యక్రమ ప్రారంభం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ ఇనాక్ సాహిత్యం ప్రత్యేకం గా దళిత వాదం అనే కన్నా సామాజిక రుగ్మతలు అసమానతలు కు వ్యతిరేకం గా మార్పు కోసం ఉద్దేశించి రాసిన వివిధ సాహితీ ప్రక్రియలు అని చెప్పారు ప్రముఖ రచయిత డాక్టర్ అద్దేపల్లి రామ మోహన రావు అనువదించిన ఇనాక్ రచన నిశ్శబ్ద స్వరం గ్రంథం ఆవిష్కరించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత కొన్ని ఏళ్ళుగా ఇనాక్ సాహితీ సప్తాహం గాన సభ నిర్వహణలో జరుపుతూ ఆయన పట్ల ఉన్న గౌరవాన్ని ప్రకటిస్తున్నాం అని తెలిపారు ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ

నిశ్శబ్ద స్వరం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

తన రచనలు తో పాటు ప్రముఖులు తన రచనల పై చేసిన విశ్లేషణ అనువాద రచనలు ఆవిష్కరణ ప్రతి ఏడూ నిర్వహిస్తున్న గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి నిస్వార్థ సాహితీ సేవకు ధన్య వాదాలు తెలిపారు వేదిక పై ఆచార్య మధు జ్యోతి ఆచార్య ఫణీంద్ర నిశ్శబ్ద స్వరం గ్రంథ సమీక్ష చేశారు తొలుత గాన సభ సంగీత గురువు సంయుక్త తన శిష్య బృందం తో లలిత సినీ గీతలు మధురం గా ఆలపించారు ప్రముఖ నాట్య గురువు రాధిక డాక్టర్ కుందనిక శిష్య బృందం కూచిపూడి నృత్య అంశాలు ఆకట్టుకున్నాయి

దేశంలో స్ట్రోక్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి : వైద్యులు స్వర్ణ దీపక్

చిక్కడపల్లి జులై 1 (ప్రభాతవార్త) : ప్రస్తుతం దేశంలో స్ట్రోక్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని, అయితే సరైన సమయంలో గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడటంతో పాటు శాశ్వత వైకల్యాన్ని కూడా నివారించవచ్చని ఐఎస్‌సీసీఎం చైర్‌పర్సన్ డాక్టర్ కె.స్వర్ణ దీపక్ తెలిపారు. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్.మనోహర్ రెడ్డి, ఐఎస్‌సీసీఎం సంయుక్త ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం ఎంతో కీలకమని, ప్రారంభ గంటల్లోనే చికిత్స అందితే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా స్ట్రోక్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు

ప్రసంగిస్తున్న డాక్టర్ కె.స్వర్ణ దీపక్

న్నారు. క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ మోనిక మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలే అనేక తీవ్రమైన వ్యాధులకు ఉత్తమ నివారణ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎం. దశరథ్, ఖజాంచి రవీంద్రనాథ్, జాలీ వాకర్ కృష్ణ, మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు నాగభూషణం, వాకర్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు మురళీ కృష్ణ, మాజీ ఏవీపీ సంపత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎ. శ్రీనివాస్ రెడ్డి, ఎస్. రమేష్ రెడ్డి, ఆర్. వివేకానంద్, సీనియర్ వాకర్స్, క్లబ్ నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో టిఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

టీఆర్ఎస్‌పార్టీలోనికి చేరిన ఉద్యమకారులకు కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానిస్తున్న వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్

శేరిలింగంపల్లి,జూలై 1 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతానికి,పటిష్టతకు శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నాని,రోజురోజుకు పార్టీకి ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ నేత వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ అన్నారు. స్థానిక నేత వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో చందానగర్ డివిజన్‌లో వివిద పార్టీ ల నుంచి తెలంగాణ ఉద్యమకారుడు షేక్ అస్లంతో పాటు దాదాపు 25 మందికి పైగా కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నూతనంగా పార్టీలోనికి వచ్చిన కార్యకర్తలను వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ పార్టీ కండువాను కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో టీఆర్ఎస్ పార్టీకి మద్ద తుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు లావణ్యబండారి, విష్ణుచారి,సందీప్, మహేశ్, ప్రదీప్,రాజశేఖర్,రాజు, వజీర్ కుమార్,శ్రీనివాస్‌రాజ్, సతీశ్,రంగా,షేక్‌వలి,హాగం రాజు, బాల,తేజ,జిలాలని, మురళి,రాకేశ్, సలాం, మధు, వర్మ,సంతోష్ ఉన్నారు.

విజయవాడలో బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

ఏపి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న పాత బస్తీ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు

చార్మినార్,జూలై1 ప్రభాతవార్త : ఆషాడ మాసం సందర్భంగా ఈ సంవత్సరం జూలై నెల 26న విజయవాడ శ్రీ కనక దుర్గమ్మకు సమర్పించనున్న బంగారు బోనం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఏపి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు.హైదరాబాద్ పాతబస్తీ నుంచి పెద్ద ఎత్తున కళాకారులతో పాటు భక్తులు విజయవాడకు తరలి వచ్చి శ్రీ కనక దుర్గమ్మకు బంగారు పాత్రలో బోనం సమర్పించనున్నామని వారుమంత్రికి అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఆగష్టు నెల ఏడవ తేదీన పాతబస్తీలోని అమ్మవార్లకు శ్రీ కనక దుర్గమ్మ తల్లి పాలక మండలి తరుపున పట్టు వస్త్రాలు సమర్పించాలని వారు మంత్రిని కోరారు.ఈకార్యక్రమంలో భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ మల్యాల మధుసూధన్ యాదవ్,మాజీ అధ్యక్షులు గాజుల అంజయ్య,జనగామ మధుసూధన్ గౌడ్,ప్రతినిధులు నోముల ప్రకాష్, కోటిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి స్వామి కళ్యాణం

చార్మినార్,జూలై 1 ప్రభాతవార్త : దూద్‌బౌలి మహరాజ్‌గంజ్‌లోని శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి మరియు శ్రీ సీతారామ వీరాంజనేయ స్వామి దేవస్థానములలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి మందిరంలో బుధవారం అత్యంత వైభవంగా శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి వారి కళ్యాణం జరిగింది. పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు కళ్యాణంలో పాల్గొన్నారు.భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయం వంశ పారంపర్య ధర్మకర్త మహేశ్వరం శ్రీనివాస్‌చారి,దేవాలయాల ధార్మిక సలహాదారులు చల్లా మల్లిఖార్జున శర్మ,అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయ చార్య స్వామి,దేవాలయం ప్రధాన అర్చకులు సి.వీరయ్య శర్మ,కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నాగేశ్వర చారి,తిరుమల వంశీ చార్యతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం

సర్ ప్రక్రియపై ఇంటింటికీ ఫారాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్న కుంట సిద్ధిరాములు

పేట్ బషీరాబాద్, జూలై 1, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 132వ డివిజన్ జీడిమెట్ల పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పేట్ బషీరాబాద్ గ్రామంలో ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తూ ఓటర్లకు అవగాహన కల్పించారు.బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కుంట సిద్ధిరాములు బీఎల్ఓలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఫారాలను ఎలా నింపాలి, ఎలాంటి తప్పులు చేయకుండా వివరాలను నమోదు చేయాలి, అవసరమైన సమాచారం ఏ విధంగా సమర్పించాలనే అంశాలపై ఓటర్లకు వివరించారు.ఈ కార్యక్రమంలో బచ్చ జ్ఞానేశ్వర్, అనిల్ గౌడ్, కవిత, కృష్ణ, వినీత్, మురళి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఈసీగా లక్ష్మణ్ గుప్త

నియామక పత్రం అందుకుంటున్న లక్ష్మణ్‌గుప్త

చాంద్రాయణగుట్ట, జూలై 1, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా ఉప్పుగూడ దానయ్యనగర్ నివాసి సరాబు లక్ష్మణ్ గుప్త నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త నుండి బుధవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ గుప్త మాట్లాడుతూ ఆర్యవైశుల అభివృద్ధికి కృషి చేస్తూ స్థానిక, జిల్లా సంఘానికి అధ్యక్షులుగా పనిచేసిన లక్ష్మణ్ సేవలను గుర్తించి రాష్ట్ర మహాసభలో అవకాశం కల్పించినట్లు తెలిపారు. మహాసభ అభివృద్ధికి, సంఘీయుల అభ్యున్నతికి కృషి చేయగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతల మేరకు ఆర్యవైశ్య జాతి ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవం, మహాసభ ఉన్నతి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని లక్ష్మణ్ గుప్త పేర్కొన్నారు. పలువురు ఆర్యవైశ్యులు లక్ష్మణ్ గుప్తను అభినందించారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తికి రిమాండ్..

చందానగర్, జూలై 1, ప్రభాతవార్త : శీతలపానియంలో మత్తుమందు కలిపి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని చందానగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారంలో నివాసముండే కంది జ్ఞానేశ్వర్ (45) గతంలో బీఆర్ఎస్ పార్టీలో పనిచేసి అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఇతను స్థానికంగా నివాసం ఉండే ఓ మహిళలకు దగ్గరయ్యాడు. 2019లో ఆమెకు భర్త చనిపోగా 2024 నుంచి ఆమెతో చనువు పెంచుకున్నాడు. ఈ చనువుతోనే ఆమెకు శీతలపానీయంలో మత్తుమందు కలిపి పలుమార్లు అత్యాచారం చేశాడు. సంగారెడ్డి జిల్లా పరిధిలో ఆమెకు ఉన్న ఒక నివాస స్థలాన్ని సైతం దొంగతనంగా పత్రాలు కాజేసి 70 లక్షలకు విక్రయించాడు. ఇతని మోసాన్ని గుర్తించిన సదరు మహిళ చందానగర్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితుడు జ్ఞానేశ్వర్‌ను మూడు రోజుల క్రితం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ విషయాన్ని చందానగర్ పోలీసులు గోప్యంగా ఉంచారు. మూడు రోజుల అనంతరం విషయం బయటికి పొక్కినా పోలీసులు మాత్రం మీడియాకు వివరాలు వెల్లడించేందుకు సమ్మతించకపోవడం గమనార్హం.

రోగి కళ్లల్లో ఆనందాన్ని చూడటమే వైద్యుని లక్ష్యం : ఆచార్య జొన్నలగడ్డ అనురాధ

శేరిలింగంపల్లి,జూలై 1 ప్రభాతవార్త

రోగుల కళ్లల్లో ఆనందాన్ని చూడటమే వైద్యుని లక్ష్యమని, అందులో భాగంగా వైద్యులు ఎంతకష్టమైనా ఇష్టపడతారని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సీటి ఉపకులపతి ఆచార్య జొన్నలగడ్డ అనురాధ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ డాక్టర్స్ ఫోరం సంయుక్తంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సీటీలోని జాకీర్ హూస్సెన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ వైద్యుల దినోతవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సీటీ ఉపకులపతి ఆచార్య జొన్నలగడ్డ అనురాధ, అంకాలజీ, హెమటాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఏవీఎస్ సురేశ్‌లు మాట్లాడుతూ.. మనదేశంలో 1991 జూలై 1వ తేది నుంచి ఒక ప్రత్యేకమైన నినాదంతో ప్రతి ఏడాది జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాది మాస్ 2 వెనుక వైద్యులను ఎవరు స్వస్థపరుస్తారనే నినాదంతో నిర్వహిస్తున్నారన్నారు. నేటి యువ వైద్యులు డాక్టర్ బీసీ రాయ్ జీవితాన్ని ఆదర్శరంగా తీసుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల్లోని వివిధ ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తూ రోగులకు ఉత్తమ సేవలందిస్తున్న 35 మంది వైద్యులకు భారత రత్న డాక్టర్ బీసీ రాయ్ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తినందన్‌రెడ్డి,మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్,హైదరాబాద్ డాక్టర్ ఫోరం కన్వీనర్ డాక్టర్ రవీంద్ర కుమార్,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సబ్యులు అమ్మయ్యచౌదరి,జనార్దన్,వాణి సాంబశివరావు,ఉమా చంద్రశేఖర్,సీతా కుమారీ,విజయలక్ష్మీ,జ్యోతి,మిరియాల ప్రీతం, సీహెచ్ వెంకటేశ్వరరావు,బాలన్న, సత్యనారాయణ, హెచ్‌సీయు హెల్త్ సెంటర్ సిబ్బంది,ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ వైద్యుల దినోత్సవంలో పాల్గొన్న ఆచార్య జొన్నలగడ్డ అనురాధ,డాక్టర్ ఏవీఎస్ సురేశ్ తదితరులు

ఓటరు జాబితా సమగ్ర సవరణపై రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష

అత్తాపూర్ జూలై1 ,ప్రభాతవార్త : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (సర్)లో రాజకీయ పార్టీల తరఫున బూత్ లెవెల్ ఏజెంట్లుగా నియమితులైన వారు బూత్ లెవెల్ ఆఫీసర్లతో కలిసి సమన్వయంగా ముందుకు సాగేటట్లు రాజకీయ పార్టీల నాయకులు సూచనలు చేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్, నియోజకవర్గం ఈఆర్ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 44 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి నగరంలోనే రాజేంద్రనగర్ నియోజకవర్గం సర్ కార్యక్రమంలో మొదటి స్థానంలో నిలిచిందని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ఆరు లక్షల 35 వేల పైచిలుకు ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు రెండు లక్షల 70వేల పైచిలుకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడం జరిగిందన్నారు . రాజకీయ పార్టీల తరపున నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లు కొన్ని చెట్ల బీఎల్ఓ లకు

సహకరిస్తున్నారని, మిగతా చోట్ల వారు పట్టించుకోవడంలేదని వాదనలు వినిపిస్తున్నాయన్నారు. అలా కాకుండా ప్రతి బూత్ లో బూత్ లెవెల్ ఏజెంట్లు బూతు లెవల్ ఆఫీసర్లకు సహకరించి ప్రతి ఓటర్ కు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, వారు పూర్తి చేసి తిరిగి ఇచ్చేవరకు కలసి పనిచేయాలన్నారు. సమీక్ష సమావేశం లో ఏ ఈ ఆర్ ఓ లు మల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, రాములు లతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు

ప్రభుత్వ బాలికల వసతి గృహంలో కుర్చీలు, ఫ్యాన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి జులై 1 (ప్రభాతవార్త) : బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహం లో రోషన్ లాల్ అగర్వాల్ ఫౌండేషన్ ట్రస్ట్ అధినేత రాజేష్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో వసతి గృహానికి అవసరమైన బుధవారం అవసరమైన కుర్చీలు, ఫ్యాన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. టీపీసీసీ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ చైర్మన్ రాజేష్ కుమార్ అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై, వసతి గృహ విద్యార్థినులకు అవసరమైన కుర్చీలను, ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలనే సత్సంకల్పంతో ఫౌండేషన్ తరఫున ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడంలో రోషన్ లాల్ అగర్వాల్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూపేష్ అగర్వాల్, నవ్వ రాజు , రఘువీర్ , లక్ష్మణ్ వర

గోల్కొండ జిల్లా బిజెపి దళిత మోర్చా అధ్యక్షుడిగా పూర్ణచందర్ రావు

మజ్జి పూర్ణచందర్‌రావును శాలువాతో ఘనంగా సన్మానించిన బిజెపి నాయకులు

మెహిదీపట్నం, జులై 1, ప్రభాతవార్త : గోల్కొండ జిల్లా బిజెపి దళిత మోర్చా నూతన అధ్యక్షునిగా లంగర్ హౌస్‌కు చెందిన మజ్జి పూర్ణచంద్రర్ రావు నియమితులైనారు. ఈ సందర్భంగా లంగర్ హౌస్ డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాలవేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. గోల్కొండ జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మజ్జి పూర్ణ చందర్రావు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తల సమన్వయంతో ముందుకు వెళ్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. సన్మానించిన వారిలో సీనియర్ నాయకులు అల్వాల ఇంద్రసేన రెడ్డి నాయకులు జెన్న సుధాకర్, అల్వాల నరేందర్, సాయిరాజ్, రఘులు ఉన్నారు.

ఆలయ అబివృద్ధికి కృషి చేస్తా : నాగేందర్ యాదవ్

మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయం నూతన ధర్మకర్తలుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట,జూలై 1 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తనకు అప్పగించిన బాధ్యతలను వమ్ము చేయకుండా ఆలయ అభివృద్ధికి పాటుపడుతానని శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయ నూతన చైర్మన్ గుజ నాగేందర్ యాదవ్ తెలిపారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆలయ ప్రాంగణంలో నూతన ధర్మకర్తల పాలక మండలి నప్రమాణ స్వీకారోత్సవం ఆలయ ఈఓ విఠల్,దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలుల నేతృత్వంలో ప్రమాణ స్వీకారోత్సవం అట్ట హాసంగా జరిగింది. ధర్మకర్తలుగా కె.సాయి కుమార్, కె.పద్మజా,జి.గిరిధర్, వల్లిప్రశాంత్, ఏ.మల్లేశ్, ఆర్.శివ కుమార్, ఇ.క్రిష్ణానందం,ఎస్.సంధ్య, కె.ధర్మేందర్, సి.హెచ్. నవీన్ కుమార్, పంగ రాజయ్య, ఎక్స్‌ఫిసియో మెంబర్‌గా టీ. రాజేశ్వర శర్మ, ఆలయ ధర్మకర్తలు,అభివృద్ధి కమిటీ ప్రతినిధులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరి పదవీ కాలం 3 సంవత్సరాల పాటు కొనసాగుతుందని ఈఓ విఠల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండు రంగ విఠలేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ అల్లాడి గౌరి శంకర్,సీనియర్ కాంగ్రెస్ నేతలు సంతోష్ యాదవ్, బద్రి యాదవ్,హరిబాబు యాదవ్, నీరజ్ భక్తులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అమోఘం : చిలుకు స్వామి

రైల్వే ఆసుపత్రి డాక్టర్లను సత్కరిస్తున్న సీసీ.ఎస్.ప్రెసిడెండ్ డాక్టర్ చిలుకు స్వామి తదితరులు

కంటోన్మెంట్,జూలై 1 ప్రభాతవార్త: రైల్‌లో నప్రయాణించే ప్రయాణికులు సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేరాలంటే రైల్వే ట్రాక్‌మెన్‌లు, గ్యాంగ్ మెన్‌లు,రైల్వే ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని, అదే విధంగా ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ఎంతో కీలకమని దక్షిణ మధ్యరైల్వే సీసీ.ఎస్.ప్రెసిడెంట్ డాక్టర్ చిలుకు స్వామి, రైల్వే మజ్దూర్ యూనియన్, సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి బి.రవిందర్,కోశాధికారి నర్సింహారెడ్డిలు తెలిపారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని బుధవారం చిలుకల గూడ రైల్వే ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లను రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు ఘనంగా సత్కరించారు. నప్రజల ప్రాణాలను కాపాడేందుకు డాక్టర్లు నిరంతరం సేవలు అందిస్తున్నారని,అదే విధంగా రైల్వే ఉద్యోగులు కూడా 24 గంటల పాటు సేవలు అందిస్తున్నారని, వారి సేవలు అమోగమన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు కె.నారాయణ స్వామి, బ్రాంచ్ కార్యదర్శి వినాయకరావ్,సి.వీరయ్య,బ్రాంచ్ చైర్మన్‌ఖాదర్,సునీల్, ప్రభాకర్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో వైద్యులకు సన్మానం

నిమ్స్ డైరక్టర్‌ని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్స్ ప్రతినిధులు

జూబ్లీహిల్స్, జులై 1, ప్రభాతవార్తః
జాతీయ వైద్యుల దినోత్సవం, భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ జయంతిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్స్ ఆధ్వర్యంలో నిమ్స్ డైరెక్టర్‌తోపాటు వైద్యులను ఘనంగా సన్మానించారు. నిమ్స్ డైరక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు నిమ్స్‌కు అంబులెన్స్‌ను విరాళంగా అందించిన నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ ప్రజ్ఞా రంగనాథ్‌ని ఈ సందర్భంగా సత్కరించారు. వైద్యుల సేవలను గుర్తిస్తూ, సమాజానికి వారు అందిస్తున్న అమూల్యమైన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ మీడియా రిలేషన్స్ ఆఫీసర్ సత్యగౌడ్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్స్ అధ్యక్షుడు లయన్ మోహన్ గడ్డం, కార్యదర్శి లయన్ శ్రీను ప్రశాంత్, కోశాధికారి లయన్ దివాకర్ దేపాల, జిల్లా చైర్మన్లు లయన్ ఆకుల రవీందర్ రావు, లయన్ వైలా శ్రీనివాస్ రావు, లయన్ మల్లెల నర్సింగ్ రావు, లయన్ పోతాని గోపాల్, లయన్ కొండూరి నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ డివిజన్‌లో గల మారుతి ఎంక్లేవ్ కాలనీలో బిఎల్ఓ రాజుతో కలిసి బిజెపి మహిళా మోర్చా నాయకురాలు వనిత రెడ్డి ఎన్యుమరేషన్ ఫార్ములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనితారెడ్డి మాట్లాడుతూ..ఓటర్ కార్డులో స్పష్టమైన తమ వివరాలను ఎస్ఐఆర్ పత్రంలో నమోదు చేసుకోవచ్చన్నారు.

దళిత జాతి అభ్యున్నతి కోసం నాగయ్య జీవితం త్యాగం

సైఫాబాద్, జులై 1 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ అశయాల సాధన యోధుడు డాక్టర్ కె.నాగయ్య ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోను భావుడని పలువురు వక్తలు చెప్పారు. సుమారు ఆరు దశాబ్దాల పాటు ఆనేక దళిత ఉద్యమాల్లో పాల్గొని ప్రభుత్వాలను ఒప్పించి విజయాలను సాధించిన నాగయ్య ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని వారు కొనియాడారు. ఆర్‌పిఐ, అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సైఫాబాద్‌లోని ఆర్‌పిఐ కార్యాలయంలో జరిగిన నాగయ్య 93వ జయంతి సభలో ఆర్‌పిఐ తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మా రావు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాదరం వినయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అంబేద్కర్ ఉద్యమ నిర్మాత, ఎపిలో మొట్టమొదటి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడుగా, ఎపి ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్‌గా దళిత జాతి కోసం

డాక్టర్ కె.నాగయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టి.పద్మారావు, విజయ్‌కుమార్ తదితరులు

ఎన్నో పోరాటాలు నిర్వహించారని వారు కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో నాగయ్య ఆనాటి ప్రభుత్వాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించి, దళిత జాతికి ఉద్యమకారుడిగా స్ఫూర్తి నిచ్చారని వారు తెలిపారు. అంబేద్కర్, నాగయ్య అశయాల సాధన కోసం దళిత నేతలు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు వారు నాగయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సభలో దళిత నేతలు దాసరి ప్రభు , ప్రమోద్‌కుమార్, విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణ విడుదల చేయకపోతే ఉద్యమం

చిక్కడపల్లి జులై 1, ప్రభాతవార్త : ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణ విడుదల చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని అఖిలపక్ష విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో కళాశాల బంద్‌కు మద్దతుగా అఖిలపక్ష విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాత విధానంలోనే పథకాన్ని కొనసాగించాలని సమావేశంలో నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ , బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగేశ్వరరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జావిద్, బీజేవైఎం అధికార ప్రతినిధి సురేష్ గౌడ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడారి స్వామి యాదవ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరసింహ నాయక్, ఓయూ జేఏసీ చైర్మన్ మాలింగ లింగస్వామి, బీసీ సంఘం నాయకులు మాదేశి రాజేందర్, గూడూరు భాస్కర్, బీఆర్ఎస్‌వీ ప్రశాంత్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం గుంటి మహేష్, బీఆర్ఎస్‌వీ శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.బంద్‌కు ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ అసోసియేషన్ ప్రతినిధులు సూర్యనారాయణ రెడ్డి మద్దతు ప్రకటించగా,

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ , బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు

తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ అసోసియేషన్ కూడా సంఘీభావం తెలిపింది. సమావేశంలో నేతలు మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే ప్రభుత్వంపై ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే పరిస్థితి సృష్టించబడుతోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాన్ని చూసైనా తెలంగాణ ప్రభుత్వం సిగ్గుపడాలని నేతలు విమర్శించారు. నిధులు విడుదల చేయకపోతే ప్రభుత్వానికి తాడోపేడో పరిస్థితి తప్పదని హెచ్చరిక చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోతే ప్రభుత్వంపై పోరాటం తప్పదని స్పష్టం చేశారు.

సవరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి : పద్మారావు గౌడ్

అధికారుల నుంచి ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జూలై 1 ప్రభాతవార్త: జంటనగరాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియలో భాగంగా బుధవారం జీ.హెచ్.ఎం.సి. అధికారుల బృందం మోండా మార్కెట్ లో ని పద్మారావు గౌడ్ నివాసాన్ని సందర్శించింది. ఎన్యుమరేషన్ పత్రాలను ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ కు అందించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సవరణ నెపంలో అర్హుల ఓట్లు తొలగిస్తే సహించబోమని స్పష్టం చేశారు. మరణించిన వారి పేర్లు తొలగించాలని, కొత్త ఓటర్లకు కూడా అవకాశం కల్పించాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే యజమాన్యాలపై చర్యలు

అత్తాపూర్ జూలై1 ,ప్రభాతవార్త : పాఠశాల బస్సులు నడిపేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ సిహెచ్ రాజు పేర్కొన్నారు.ట్రాఫీక్ -111 డిసిపి రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు బుధవారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలను ఎస్ఐ,ఎఎస్‌లతో కలిసి ఎస్‌హెచ్ఓ రాజ్ సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల బస్సు డ్రైవర్లకు లైసెన్సులు,బస్సుల ఫిటెనెస్ సర్టిఫికేట్,ఆర్‌సి,ఇన్సూరెన్స్,పోల్యూషన్ సరిఫికేట్ వంటి పత్రాలను తనిఖీ చేశారు.బస్సుల పార్కింగ్ విద్యార్థులు ఎక్కే,దిగే ప్రదేశాలు పాఠశాల ఆవరణలో ఉన్నాయా లేదని పరిశీలించారు.ట్రాఫీక్ ఎస్‌హెచ్ఓ రాజు మాట్లాడుతూ...నిర్లక్ష్య డ్రైవింగ్‌తో విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం ఉందని కావున పాఠశాల డ్రైవర్లు ట్రాఫీక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బస్సు సీజ్ చేయడంతఓ పాటు నిర్వాహలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గోల్కొండ జోన్ నూతన డిసిపిగా రాఘవేందర్ రెడ్డి

మెహిదీపట్నం, జులై 1, ప్రభాతవార్త : హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని గోల్కొండ జోన్ నూతన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా జె.రాఘవేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీసీపీగా బాధ్యతలు నిర్వహించిన జి.చంద్రమోహన్ యాంటీ కరప్షన్ బ్యూరో జాయింట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లగా..తెలంగాణ గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా సేవలందించిన జె. రాఘవేందర్ రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గోల్కొండ జోన్ పరిధిలోని ప్రజలకు ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా లేదా ఏదైనా సమాచారం అందించడం కోసం నేరుగా మొబైల్ నంబర్ 87126 61550లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం

సైఫాబాద్, జులై 1 ప్రభాతవార్త: కైరతాబాద్ అసెంబ్లీ నియోజవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన 42 బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం బుధవారం హైదర్‌గూడలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు మోతె రోహిత్ ముదిరాజ్, డివిజన్ మాజీ కార్పోరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్ని బూత్ లెవెల్ ఏజెంట్లకు ప్రస్తుతం నడుస్తున్న ఎస్ఐఆర్ పేరుతో కొనసాగుతున్న అక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిఎం.ఆర్.ఎఫ్.చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్,జూలై 1 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు కార్పోరేట్ అసుపత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని మల్కాగిరి ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్ రెడ్డి తెలిపారు. బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన శ్రీశైలం యాదవ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 30 వేల చెక్కును ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తోటికోడళ్లకు 'గోడ' తెచ్చిన తంటా

- బంజారాహిల్స్‌లో ఇరువర్గాల కేసు నమోదు

జూబ్లీహిల్స్, జులై 1, ప్రభాతవార్తః
ఓ గోడ ఇరుకుటుంబాల మధ్య గొడవకు కారణమైంది. దాడులకు దిగడంతో వారి పంచాయితీ కాస్త ఠాణాకు చేరింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 7లో నివసించే నాగమణి ఆమె భర్త మల్లికార్జున్ ఫుడ్ స్టాల్ నడిపిస్తున్నారు. వారి ఇంటి తోటికోడలు ముల్గి రేఖ ఆమె భర్త వెంకటేష్ నివసిస్తున్నారు. ఉమ్మడిగా సంక్రమించిన ఆస్థిలో ఇటీవల నిర్మించిన కొత్త గోడ వీరి రెండు కుటుంబాల మధ్య గొడవకు కారణమైంది. వెంకటేష్, రేఖ ఇద్దరు తమపై దాడికి పాల్పడ్డారని నాగమణి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా కట్టిన గోడను ధ్వంసం చేయడమే కాకుండా తనపై దాడికి పాల్పడటంతో తీవ్ర రక్తస్రావ గాయలయ్యాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని పదేపదే వేధిస్తూ బెదిరిస్తున్నారన్నారు. ఈ మేరకు పోలీసులు వెంకటేష్, రేఖలపై 324(4), 118(1) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇదే వ్యవహారంలో రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన తోటికోడలు నాగమణికి తమకు మధ్య ఉమ్మడి వారసత్వంగా వచ్చిన ఆస్థి విషయంలో గొడవలున్నాయని, నాగమణి గోడ నిర్మిస్తుండగా ఆయా రాళ్లు తన ఇంటి ఆవరణలో పడ్డాయని, రక్షణ చర్యలు చేపట్టాలని కోరితే తనపై ఇటుకతో దాడి చేసిందని, తనకు గాయాలయ్యాయని రేఖ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు నాగమణి, మల్లికార్జున్‌లపై సెక్షన్ 118(1), 351 (2), రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు.

డిజిటల్ దస్తూరికి కూకట్‌పల్లి డిసి

కెపిహెచ్‌బి కాలనీ, జూలై 1, ప్రభాతవార్త
పరిపాలన విషయంలో అధికార యంత్రాంగానికి ఏ స్థాయిలో చిత్తశుద్ధి ఉందో మూసాపేట మున్సిపల్ కార్యాలయాన్ని చూస్తే ఇట్టే అవగతం అవుతుంది. ప్రజల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా అనేక రకాలైన విధానాలను అవలంబిస్తూ శీఘ్రగతిన వారి సమస్యల పరిష్కారం చేయాలని ఒకపక్క గుడ్ గవర్నెన్స్ పేరిట ప్రభుత్వం ప్రణాళికలు ప్రవేశపెడుతుంటే ఆచరణలో మాత్రం అవి పూర్తిస్థాయిలో విఫలమవుతున్నాయి. గతంలో ఒక ఫైల్‌కు సంబంధించి తుది ఉత్తర్వులు రావాలంటే నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అర్జిదారులు ప్రదక్షి ణలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. కానీ కాల క్రమేణా డిజిటల్ యుగంలో సింగిల్ విండో సిస్టం ద్వారా అనేక రకాలైన నిర్మాణ అనుమతులు గాని, ఇతర సమస్యల పరిష్కారం గాని జరుగుతూ వస్తుంది. కానీ ఈ మధ్యకాలంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధి కాస్త మూడు మున్సిపాలిటీలుగా రూపాం తరం చెందడం, వాటికిందికి డిప్యూటీ కమిషనర్లు రావడం చక చకా జరిగిపోయాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి వచ్చే మూసాపేట డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో గత పది రోజుల క్రితం నూతన కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయనకు సంబంధించిన డిజిటల్ సిగ్నేచర్ అనుమతులు కూడా సహజం గానే ఉన్నతాధికారులు అప్పజెప్పడం రివాజు. కానీ ఆయన బాధ్యతలు స్వీకరించి దాదాపు పది రోజులు కావస్తున్నా అన్ని విభాగాల డిజిటల్ సిగ్నేచర్ అనుమతులు ఆయనకు లభించిన ప్పటికీ అత్యంత కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగం డిజిటల్ సిగ్నేచర్ బాధ్యతలు నేటికీ ఆయనకు అందుబాటులోకి రాకపోవ డం పలు అనుమానాలకు తావిస్తుంది. నిజానికి ఒక అధికారి సెలవుపై వెళ్ళినా సరే తన కిందిస్థాయి అధికారికి డిజిటల్ సిగ్నేచర్ బాధ్యతలు అప్పజెప్పి వెళ్లడం అధికార యంత్రాంగం లో సహజం. కానీ ఒక డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి బది లీపై వచ్చి పది రోజులు అవుతున్న టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి అతను ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, డిజిటల్ సిగ్నేచర్ చేసే వెసులుబాటు లేకుండా చేయడం వెనుక ఉన్నతా ధికారుల పాత్ర ఏమైనా ఉందా అనే అనుమానాన్ని పలువురు వ్యక్తపరుస్తున్నారు. నిజానికి మున్సిపాలిటీ విభాగం అంటేనే టౌన్ ప్లానింగ్ విభాగం దానికి గుండెకాయ వంటిది. అలాంటి విభాగానికి సంబంధించిన పనులే అధిక శాతం మున్సిపాలి టీలో ఉంటాయి. కానీ కేవలం ఇతర రెవిన్యూ, శానిటేషన్ లాంటి విభాగాలకు నిర్ణయాలు తీసుకునే డిజిటల్ సిగ్నేచర్ అనుమతులను ఇప్పటికే మంజూరు చేసిన ఉన్నతాధికారులు అత్యంత కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన తుది ఉత్తర్వులు తీసుకోవడానికి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ దుస్థితి రావడానికి ఉన్నతాధికారుల నిరక్ష్యమా? లేక ఇక్కడి అధికారుల ఉదాసీనత అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా టౌన్ ప్లానింగ్‌కు చెందిన అనుమ తుల మంజూరు కోసం ఈ ప్రాంత ప్రజలు నిరీక్షి ణ చేయక తప్పని అనువార్య స్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిం చి ఈ సమస్యపై వెంటనే నిర్ణయం తీసుకొని డిప్యూటీ కమి షనర్ డిజిటల్ సిగ్నేచర్ అంశాన్ని పరిష్కరించాలని ఆర్జీదారులు కోరుతున్నారు.

డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి వివరణ...

ఈ విషయమై శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా అన్ని విభాగాలకు సంబంధించిన డిజిటల్ సిగ్నేచర్ చేసే అనుమతులను ఉన్నతాధికారులు ఇప్పటికే ఇచ్చారని, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఇంకా అనుమతి రావాల్సి ఉందని అయితే ఎస్ఐఆర్ పని ఒత్తిడి వల్ల అటు ఉన్నతాధికారులు గాని ఇటు తాము గాని పనిలో నిమగ్నమై ఉన్న కారణంగా కొంత ఆలస్యం జరిగిన విషయం వాస్తవమే అన్నారు.

ఆర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకుగాను ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను ఇప్పటికే తీసుకెళ్లడం జరిగిందని, ఒకటి రెండు రోజులో సమస్య పరిష్కారం కాగలదని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు.

పోలీసు పేరుతో దోపిడీ.. నకిలీ కానిస్టేబుల్ అరెస్ట్

పేట్ బషీరాబాద్, జూలై 1, ప్రభాతవార్త : పోలీసు కానిస్టేబుల్ గా నటిస్తూ బాలికల హాస్టళ్లను లక్ష్యంగా చేసుకుని విద్యార్థినులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ పోలీసును పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పకడ్బందీగా నిర్వహించిన దర్యాప్తులో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి నగదు, పోలీసు యూనిఫాం, బొమ్మ తుపాకీ, ద్విచక్రవాహనం తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్రలోని మోనిదా శ్రీ గర్ల్స్ హాస్టల్ యజమాని గుడూరు విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్నట్లు, పోలీసు యూనిఫాంలో వచ్చిన ఓ వ్యక్తి అర్ధరాత్రి హాస్టల్‌లోకి ప్రవేశించి విద్యార్థినులపై తప్పుడు కేసులు పెడతానని బెదిరిస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేశాడు.దీనిపై వెంటనే స్పందించిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని సేకరించి నిందితుడిని గుర్తించారు. అరెస్టు చేసిన నిందితుడు పండి యాదగిరి అలియాస్ అనిల్ కుమార్ (25)గా పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం అతను ఓ ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, గతంలో మహంకాళి ట్రాఫిక్ పోలీసుల వద్ద రోజువారీ కూలీగా పనిచేసిన నిందితుడు, పోలీసుల విధానాలు గమనించి అదే తరహాలో నేరాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. పోలీసు యూనిఫాం, జాకెట్, నేమ్‌ప్లేట్ సమకూర్చుకుని, పల్సర్ బైక్‌పై తిరుగుతూ పోలీసు కానిస్టేబుల్‌గా నటించేవాడ

ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ఎనలేనివి: చౌకి రవికుమార్

పదవీ విరమణ పొందిన ధనలక్ష్మిని సన్మానిస్తున్న చౌకి రవికుమార్, బుగుడల సుదర్శన్ తదితరులు

మలక్ పేట, జూలై 1, ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ఎనలేనివని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పేర్కొన్నారు. మలక్ పేట సబ్ డివిజన్ 2లో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన ధనలక్ష్మిని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, బిఆర్ఎస్ గ్రేటర్ కార్యదర్శి బుగుడాల సుదర్శన్ ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధనలక్ష్మికి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామ్ గారు యూనియన్ అధ్యక్షుడు రాంబాబు జలమండలి డిజిఎంలు కృష్ణమోహన్, హస్మత్ అలీ, బిక్షపతి, కౌంటర్ శ్రీనివాస్, మేడ్చల్ శ్రీనివాస్, సునీల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి: సలాం షాహిద్

డ్రైనేజీ సమస్యలను పరిష్కరింప జేయిస్తున్న మాజీ కార్పొరేటర్ సలాం షాహిద్ తదితరులు

మలక్ పేట, జూన్ జూలై 1, ప్రభాతవార్త: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని చౌవుని డివిజన్ మాజీ కార్పొరేటర్ సలాం షాహిద్ పేర్కొన్నారు. డివిజన్ లోని చంచల్ గూడలో డ్రైనేజీ మురుగునీరు రోడ్లపై పొంగి ప్రవహిస్తుండడంతో స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆయన స్పందించి జలమండలి అధికారులు, సిబ్బంది తో కలిసి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి సమస్యలను పరిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, సిబ్బంది, పలువురు నాయకులు, పాల్గొన్నారు.

అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం అమరేందర్

అమరెందర్‌ను సన్మానిస్తున్న సహచర రైల్వే ఉద్యోగులు

తార్నాక, జులై 1 ప్రభాతవార్త : దక్షిణ మధ్య రైల్వేలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (డ్రాయింగ్)గా 35 సంవత్సరాలకు పైగా విశిష్ట సేవలందించిన పి. అమరేందర్ పదవీ విరమణ సందర్భంగా అధికారులు, సహోద్యోగులు ఘనంగా సన్మానించి భావోద్వేగపూర్వకంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, విధి నిర్వహణలో పి. అమరేందర్ అలుపెరగని కృషి, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి సంస్థకు విశేష సేవలందించారని కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగా పలు ప్రశంసలతో పాటు ప్రతిష్టాత్మక జనరల్ మేనేజర్ అవార్డు అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో స్టేషన్ రీమోడలింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సిబ్బంది క్వార్టర్ల రూపకల్పన, రీమోడలింగ్ వంటి కీలక ప్రాజెక్టుల్లో సమర్థవంతంగా పనిచేసిన ఆయన, రైల్వే భద్రత, ఆధునికీకరణ, అభివృద్ధికి అనేక వినూత్న సూచనలు అందించారని తెలిపారు. రైల్వే శాఖ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని అధికారులు, సహోద్యోగులు ఆకాంక్షించారు.

కలెక్టర్ మనుచౌదరితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

జిల్లా కలెక్టర్ మనుచౌదరితో బేటి అయిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, జూలై 1 ప్రభాతవార్త : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూచౌదరిని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌళిక సదుపాయాల కల్పన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, జెట్ట కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

భార్య వేధింపుల కేసులో పోలీసు అధికారికి ఏడాది జైలు

నేరేడ్ మెట్ , జూలై 1,ప్రభాతవార్త : భార్య వేధింపుల కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ పోలీసు అధికారికి మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా న్యాయస్థానం ఏడాది సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించినట్లు నేరేడుమెట్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నేరేడుమెట్ పోలీస్ స్టేషన్‌లో 2021లో క్రైమ్ నంబర్ 106/2021గా భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 498ఏ కింద నమోదైన కేసులో విచారణ పూర్తయిన అనంతరం నిందితుడు సుబీర్ చక్రవర్తి (40), పశ్చిమ బెంగాల్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని గౌరవ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి-మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం దోషిగా నిర్ధారించి తీర్పు వెలువరించింది. నిందితుడికి ఒక సంవత్సరం సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి ఎస్. అనిల్ కుమార్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవినాష్ పెనుగొండ, కోర్టు డ్యూటీ అధికారి చి. సత్యనారాయణ, సమన్స్ కానిస్టేబుల్ ఆర్. సుదర్శన్, పర్యవేక్షణ అధికారి ఏఎస్ఐ పి. నరసింహ రెడ్డి సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో ప్రాసిక్యూషన్ తరఫున కేసు విజయవంతంగా ముగిసిందని నేరేడుమెట్ పోలీసులు పేర్కొన్నారు.

రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు

-పనులు పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

- త్వరలో మరో రెండు చెరువుల అభివృద్ధి

రామంతాపూర్, జూలై 1 ప్రభాతవార్త : రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను బుధవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామంతాపూర్ పెద్ద చెరువులో చేపడుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెరువు అభివృద్ధి పనులతో ఏ ఒక్కరికీ నష్టం వాటిల్లదని తెలిపారు. నగరంలో బతుకమ్మ కొలను, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ తదితర ఏర్పాట్లను చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలోనే మిగతా రెండు చెరువులలోనూ పనులు చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని చెరువుల అభివృద్ధికి నిధులను మంజూరు చేయించడంతో పాటు పనులు సైతం ప్రారంభం అయ్యాయని తెలిపారు. నాచారంపటేల్ కుంట చెరువు, రామంతాపూర్ లోని చిన్న చెరువుల అభివృద్ధి, సుందరీకరణ

రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

పనులకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు త్వరలోనే వాటిల్లోనూ అభివృద్ధి పనులను ఇదే తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కంది ఆగిరెడ్డి, ఎం.డి.తౌఫిక్, బి.సుధాకర్‌రెడ్డి, ఆకారపు అరుణ్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, కంది శ్రవణ్‌రెడ్డి, గణేష్‌నాయక్, పలువురు డివిజన్ల అనుబంధ కమిటీల నేతలు పాల్గొన్నారు.

కాలనీల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి అండగా ఉంటాం : నవారు మల్లారెడ్డి

సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్ డివిజన్‌కు సంబంధించిన కాలనీల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి విషయంలో కాలనీవాసులకు అండగా నిలుస్తామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని అల్మాస్‌గూడ కెఆర్ఆర్ హిల్స్ కాలనీలో బుధవారం ఉదయం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులతో కలిసి పాదయాత్రలు చేస్తూ సమస్యలు పరిశీలించారు. ఈ మేరకు పలువురు కాలనీల్లో మౌళిక సదుపాయాలు, సమస్యలను మల్లారెడ్డి దృష్టికి తెచ్చారు. కాలనీ ఏర్పడి దాదాపు పది సంవత్సరాలు అవుతున్నా నేటికీ అంతర్గత రోడ్ల నిర్మాణం జరగలేదనీ దీంతో వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రోడ్ల నిర్మాణానికి, కనీస సౌకర్యాల కల్పనకు సహకరించాలని వారు ఆయనను కోరారు. ఈ మేరకు స్పందించిన మల్లారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో అభివృద్ధికి నోచుకోని కాలనీలకు సహకరిస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాలను గమనించి పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కెఆర్ఆర్ హిల్స్ కాలనీలో రోడ్ల నిర్మాణం కోసం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్ళి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని ఆయన హామీనిచ్చారు.

అల్మాస్‌గూడ కెఆర్ఆర్ హిల్స్‌లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి

ఇంకా కాలనీలో మౌళిక సదుపాయాలు, సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, శివారెడ్డి, శేఖర్ యాదవ్, మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కృష్ణ ప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ నూతన కార్యవర్గానికి అభినందనలు

కెఆర్ఆర్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా కాలనీలో పర్యటించిన నవారు మల్లారెడ్డి కార్యవర్గం వారిని అభినందించారు. కాలనీ అసోసియేన్ ఎన్నిక సందర్భంగా కొత్త అధ్యక్షునిగా ఎన్నికైన లిక్కి తిరుపతిరెడ్డిని అదే విధంగా కార్యవర్గానికి ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధి విషయంలో అసోసియేషన్‌కు సహకరిస్తామని మల్లారెడ్డి వారికి హామీనిచ్చారు.

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

తుర్కయంజాల్ జులై1,ప్రభాతవార్త

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో రాగన్నగూడ లోని ఎవిఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర రోడ్డు డెవలప్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా సేవలందిస్తున్న ప్రతి వైద్యుడికి జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వైద్య వృత్తి అనేది మానవత్వానికి ప్రతీక అని, సమాజం వైద్యుల సేవలను ఎల్లప్పుడూ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం మహాదానమని, ఒక వ్యక్తి చేసే రక్తదానం పలువురికి ప్రాణదానంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రమాదాలు, అత్యవసర చికిత్సలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, థలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం అత్యంత అవసరమవుతుందని, ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా స్వచ్ఛంద రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన తిజుళీ హాస్పిటల్ యాజమాన్యాన్ని, వైద్యులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువతను అభినందించిన మల్‌రెడ్డి రాంరెడ్డి , వారి సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ జన్మదినం, వివాహ వార్షికోత్సవం వంటి ప్రత్యేక సందర్భాల్లో రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షుడు ఓర్సు శ్రీనివాస్, ఎవిఎస్ హాస్పిటల్ యాజమాన్యం , వైద్యులు, మాజీ కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ , కొంతం వెంకట్ రెడ్డి , రేవల్లి యాదగిరి , కుంట గోపాల్ రెడ్డి , మేతరి దర్శన్ ,ఎఎంసి డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామా భీమిరెడ్డి, దాసరి సుధాకర్ రెడ్డి, పూజారి శంకరయ్య, భద్రయ్య, బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి , డాక్టర్ రాగ్య నాయక్ , రక్తదాతలు, యువకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ పిఎస్‌లో ఇద్దరు ఎస్ఐల పదవీ విరమణ

పదవీ విరమణ పొందిన ఎస్ఐ బుగ్గయ్యను సత్కరిస్తున్న డిసిపి సురేష్‌కుమార్ తదితరులు

ఉప్పల్, జూలై 1 ప్రభాతవార్త : ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐలుగా పనిచేస్తున్న చాంద్‌పాషా, ఎన్ బుగ్గయ్య పదవీ విరమణ కార్యక్రమం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ డిసిపి సురేష్ కుమార్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఏసిపి వెంకటరెడ్డి, సిఐ రామలింగారెడ్డి, డిఐ రవికుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగరాజు ఇతర సిబ్బంది పాల్గొని సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిసిపి సురేష్ కుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగుల సేవలు మరువలేనివన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు శేష జీవితం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఉప్పల్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన ఎస్ఐ మాధవరెడ్డి, హనుమాన్ నాయక్‌లకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శృంగేరి శంకర మఠం వార్షికోత్సవం

పూజలో పాల్గొన్న దేవ సురేఖభాస్కర్‌రెడ్డి దంపతులు

ఎల్.బి.నగర్, జులై 1 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఆల్కాపూరి శ్రీశృంగేరి శంకర మఠం 19వ వార్షికోత్సవం కార్యక్రమం వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకోనవింశతి (19వ) వార్షికోత్సవ మహోత్సవాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం జరిగిన బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖభాస్కర్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు వారికి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మాధిపతి కె.వి.శ్రీనివాస్‌శర్మ, సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్ ప్రక్రియ చేపట్టాలి : జిఎంఆర్

చిలుకానగర్‌లో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న బిఆర్ఎస్ సీనియర్ నేత గుడి మధుసూధన్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు తదితరులు

ఉప్పల్, జూలై 1 ప్రభాతవార్త : సర్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని చిలుకానగర్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నేత గుడి మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు బూత్‌లను ఆయన సందర్శించి ఎన్నికల ఫారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ, అంగన్‌వాడీ, బీఎల్ఓ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ఉద్దేశాన్ని వివరించి, అవసరమైన దరఖాస్తు పత్రాలను అందజేస్తూ వాటిని సకాలంలో పూర్తి చేసి సమర్పించాలని సూచిం చారు. ప్రతి ఓటరు తన వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు లేదా చేర్పులు ఉంటే వాటిని నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షులు పల్లె నర్సింగ్ రావు, పార్టీ సీనియర్ నాయకులు ఈరెల్లి రవీందర్ రెడ్డి, చేర్యాల శ్రీనివాస్, శనిగరం తిరుమలేష్, పొటోల్ల రాజు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం : బన్నాల గీత

ఉప్పల్, జూలై 1 ప్రభాతవార్త : సిఎం సహాయనిధి పేదలకు ఒక వరంలాంటిదని చిలుకానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బన్నాల గీత పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిల్కానగర్ డివిజన్ నివాసి సుధా కుమారి స్వల్ప అనారోగ్యంతో హాస్పిటల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.60వేల చెక్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఒక వరమని, అర్హులైన పేదలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ , సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలి : ఎన్వీఎస్ఎస్

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు ఓటరు ఫారం అందజేస్తున్న ఎన్నికల సంఘం అధికారులు

ఉప్పల్, జూలై 1 ప్రభాతవార్త : భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియలో భాగంగా బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను జిహెచ్ఎంసి అధికారి మమత ఇతర సిబ్బంది కలిసి ఎన్నికల ఫారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. ఓట్ల గల్లంతు కాకుండా కార్యకర్తలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గతంలో జరిగిన ఎన్నికల్లో పలువురి ఓట్లు సాంకేతిక కారణాల వల్ల లేదా బూత్‌ల మార్పు వల్ల గల్లంతయ్యాయని, సర్ సర్వే ద్వారా అలా జరగకుండా బూత్ స్థాయి అధికారులు పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా ఒకే వ్యక్తికి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉండటం వంటి అక్రమాలకు తావులేకుండా, పారదర్శకంగా జాబితా రూపొందించేలా ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా, తాళ్ల బాలకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి పత్రం అందజేత

పర్వతాలుకు ఎల్ఓసి పత్రం అందజేస్తున్న రవి ముదిరాజ్

సైదాబాద్, జులై 1 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్ దుర్గాభవాని నగర్‌కు చెందిన పర్వతాలు భార్య విజయ గత కొంత కాలంగా రుమటాలజి వ్యాధితో బాధపడుతుంది. పర్వతాలు కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండడంతో బిఆర్ఎస్ ఎల్‌బినగర్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్‌ను కలిసి తనకు సహాయం చేయాల్సిందిగా కోరడంతో ఆయన వెంటనే స్పందించి ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో పర్వతాలు చేత సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసి పత్రాన్ని పర్వతాలుకు రవి ముదిరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా రవి ముదిరాజ్ మాట్లాడుతూ విజయ చికిత్స కోసం గతంలో కూడా రెండు సార్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించడం జరిగిందన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి తన పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి : కొత్తకాపు రవీందర్‌రెడ్డి

విజేతలను అభినందిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి

సైదాబాద్, జులై 1 ప్రభాతవార్త: యువత చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని బిజెపి రాష్ట్ర నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి అన్నారు. తొమ్మిదవ ఆసియన్ కప్ ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచి పతకాలు గెలుచుకున్న క్రీడాకారులు షేక్ హమ్జద్ అద్నాన్, తేజ వర్ధన్, షేక్ సనా మహీన్, వంశీకృష్ణ, కావేటి ఆయుక్త్, అభిషేక్, కావేటి అరుష్, శశి రిత్విక్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ వంశీకృష్ణ, మేనేజర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీఓ

ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తున్న ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్,1 జులై, ప్రభాతవార్త : కందుకూరు రెవెన్యూ డివిజన్ , సరూర్‌నగర్ మండలంలోని క్రాంతి నగర్, వెంకటేశ్వరాకాలనీలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేస్తున్న తీరును, ఎన్యూమరేషన్ ఫారాలను ఆయన తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రతి ఇంటిని తప్పకుండా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయాలని, అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం గుర్తించాలని తెలిపారు. ఓటర్ల నుంచి వచ్చే ధరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ఈ పరిశీలనలో సంబధిత ఎన్నికల రిటర్నింగ్ సిబ్బంధి. తహసీల్దార్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ నవీన్, స్థానిక బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలి : బొర్ర రవి

సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త: ఈ నెల 7వ తేదీన మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలని మండల ఇంఛార్జి, జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి బొర్ర ర